# తనవంతు

శ్రీ డి. రామలింగం

గోపాలంగారి అల్లుడి సంగతి ఆవీధిలో రోజు రోజు తెలిసిపోతూంది, ఎవరైనా పెండ్లిసంబంధాలు మాట్లాడుకుంటూ గోపాలంగారి విషయం కూడా తెచ్చి నిట్టూర్పువిడువనివారులేరు. మొత్తానికి కూతురు విషయంలో గోపాలంగారు పడే అవస్థలు అనుకొని అంతా జాలిపడేవారే.

గోపాలంగారు నిజంగా ఎంతోమంచివాడని చెప్పవచ్చు. తనపనియేదో తానే. ఇతరుల విషయాలలో జోక్యంకలిగించుకోడు. ఎవరైనా మాట్లాడిస్తే ఎంతో ఆప్తబంధువులా మాట్లాడుతాడు, తన సంసారాన్ని ఎంతోగుట్టుగా జరుపుకుంటూ, నలుగురిల్లో మర్యాదస్థుల ఇల్లుఅని అనిపించుకున్నాడు. ఆయనకు యేఉద్యోగమూలేదు, పిత్రార్జితం అయిదెకరాల మాగాణితో తనూ, తన భార్యా, ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్ళు గల సంసారాన్ని బాగానే జరుపుకుంటున్నాడు. వారింటి విశేషాలు తెలుసుకుందామన్నా తెలిసేవికావు ఎవరికీనూ. కాని అల్లుడువచ్చిన మరుక్షణంనుంచి అందరినోళ్ళల్లోను గోపాలంగారి గృహపరిస్థితులే:

తన పెద్దకూతురు గుణమ్మ పెండ్లియీడుకు వచ్చిందని సంబంధాలు అనేకచోట్ల విచారించి పోయిన సంవత్సరమే రాజేశ్వరరావుకిచ్చి పెండ్లి చేశాడు. పిల్లవాడు చూపులకు బాగావున్నాడనీ, బి. యల్. చదువుకున్నాడనీ, మంచి కుటుంబానికి చెందినవాడనీ తనూ, తనభార్యా యిష్టపడి కుదుర్చుకున్నారు. ఈ సంబంధాన్నికొని పెండ్లి అయిన తర్వాతనుంచీ ఈ యిబ్బందులన్నిటికీ గురిఅయ్యారు. 'నీటిలోతు అంటులోదిగితేనేగాని తెలియదంటూరు.'

గోపాలంగారు బజారునుంచి రాగానే రమణమ్మ వచ్చిన టెలిగ్రాం కాగితాన్ని భర్తచేతికిచ్చింది. బజారునుంచి ఏవేవో పనులమీద తిరిగి వచ్చిన ఆయాసానికితోడు ఇదొక వార్తావిశేషం. టెలిగ్రాం చూచుకొని "సరే" అని శ్వాసవిడిచాడు.

భోజనాలయింతర్వాత రమణమ్మ "ఏమండీ, ఈఅబ్బాయి చూడబోతే మనఅంతు తెలిసికొనేలా వున్నాడు. పోయిన పదినెల్లనుంచీ ప్రతినెలా వంద రూపాయలు పంపిస్తూనేవున్నాం. డబ్బు పంపమని వ్రాసే ఉత్తరంతప్ప మరోఉత్తరం వ్రాయడు. ఎంతకాలమిలా పంపగలం" అన్నది.

"నేనూ ఆదే ఆలోచిస్తున్నాను. ఈ నెలతో అతని బి. యల్ చదువు పూర్తవుతుంది. తర్వాత ఏదో ప్రాక్టీసు పెట్టుకొని గడుపుకోవాలి లేకపోతే ఇక మనం అతని ఖర్చు భరించలేం" అన్నాడు గోపాలం గారు చొక్కా వేసుకుంటూ.

"తండ్రికి పింఛనువస్తుంది. పైగా సాలీనా అయిదువేల ఆదాయం వచ్చే పొలంవుంది. ఈ అబ్బాయి మాత్రం మనకే వ్రాస్తూంటాడు డబ్బు పంపమని. ఏమిటో నాకర్థం కావడంలేదు ఇదంతా" అన్నది రమణమ్మ కోపంతో.

"తండ్రి కానీ డబ్బు పంపడు. నిన్ననేగదూ శ్రీరాములుగారు చెప్పాడీసంగతి. ఆయనగారికేదో అప్పుందట. ఈ సంవత్సరం ఏదో కొత్తగా పెట్టిన కంపెనీలో షేర్లుకొని డైరక్టరయ్యాడట. దీనికి మరికొంతఅప్పు. తనఆస్తి వృద్ధిఅయే ఉపాయాలు చూస్తున్నాడు కాని కొడుకుసంగతి ఏమీపట్టించుకోకుండా మనకు వదిలేశాడు." అన్నాడు గోపాలంగారు లేచిపోతూ.

"సరే, ఇప్పుడు వందరూపాయ లెట్లా పంపించేది. మొన్ననే వున్న వందా పెద్దబ్బాయికి విశాఖపట్నం పంపామయ్యే. చేతిలో కానిలేదు" అని అడిగింది రమణమ్మ తనూ లేస్తూ.

"ఈ దఫాకు ఇలా రామయ్యగారి దగ్గర చేబదులు తీసుకుంటాను" అని గోపాలంగారు పైకండువా వేసుకున్నాడు.

"సరేగాని డబ్బు పంపుతూ సెలవుల్లో ఇక్కడికి తప్పక రావలసిందని ఉత్తరం వ్రాయండి మరచిపోకుండా" అన్నది గుమ్మందాకా పోయినభర్తతో.

గోపాలంగారు వ్రాసినట్టుగానే సెలవుల్లో రాజేశ్వరరావు వచ్చాడు. అత్తవారిల్లే అయినప్పటికీ పరాయిచోట వున్నట్టే వుంటాడు. అత్తమామలతో గాని, బావమరదలతో గాని అసలు మాట్లాడనే మాట్లాడడు. పైగా ఎంతో గంభీరంగా బెట్టుసరిగా వుంటాడు. ఇంట్లోవుంటే తనగదిలో వుంటాడు. లేకపోతే తనకు దూరపు బంధువులైన సుబ్బారావు గారింటికి వెళ్లుతాడు. తన మామగారి తాలూకు బంధువు లెవరైనా వచ్చి పలకరించితే ఏదో ముక్తసరిగా జవాబు చెప్పి వాళ్ళను పట్టించుకోకుండా వుంటాడు. ఒక్కొక్కప్పుడు ఆమాత్రం తిరుగుజవాబైనా చెప్పకుండా పోతాడు. బావమరదులొస్తే చీదరించు కుంటాడు, సరే భార్యతోనైనా అనురాగంగా వుంటాడా అంటే అదీలేదు. చీటికీ మాటికీ కోపగించు కుంటాడు, మాట్లాడడు.

మరునాడు గోపాలంగారు అల్లుడికి కొత్త వస్త్రాలు కొనుక్కొచ్చారు. అవి ఖద్దరువనీ, అంతబరువైనవి కట్టననీ తిప్పికొట్టి భోజనాలయింతర్వాత గోపాలంగారి దగ్గరకెళ్లి "నేనుఇవాళ సాయంత్రం బండికి ఇంటికి వెళ్లుతున్నాను. వచ్చేపౌర్ణమిముందు మీ కూతురును మా ఇంటికి తీసుకొచ్చి వదిలిపెట్టిపొండి" అని గోపాలంగారు తిరుగు అడిగినదానికి సమాధానం చెప్పకుండానే వెళ్లి పొయ్యాడు. తన ముచ్చట తీరనందుకు రమణమ్మ ఆనాడంతా కుమిలిపోయింది.

రోజులు గడిచాయి. గోపాలంగారి కష్టాలు గట్టెక్కాయి. సుగుణమ్మ భర్తతో అత్తవారింటిలో కాపురం చేస్తూవుంది. రాజేశ్వరరరావు ప్రాక్టీసు మొదలుపెట్టాడు. కాని కేసులు ఏమీరావడంలేదు. గోపాలం గారికీ సంగతి తెలిసి తన పలుకుబడిచేత కొంతమందికి చెప్పిపంపాడు. వారంతా వెళ్లి గోపాలంగారు చెప్పితే వచ్చాం మాకేసును చూడండి అని చెప్పకు నేవారు. అంతా బాగానే నడచిపోతూంది.

* * *

కాలప్రవాహంలో పదునాల్గు సంవత్సరాలు కొట్టుకొనిపొయ్యాయి. ఇప్పుడు రాజేశ్వరరావు నలుగురు బిడ్డలతండ్రి. ముగ్గురు కూతుళ్లు ఒక కొడుకు పెద్దకూతురు సుశీల పదునాల్గేండ్ల ప్రాయంలో నిగనిగలాడుతూంది.

కూతురు వాలకం చూస్తే రాజేశ్వర్రావుకు తన విధి స్ఫురించు తూంటుంది. ఇరుగు పొరుగువారు "పెద్దమ్మాయికెక్కడన్నా సంబంధం చూచారా!" అని అడిగినప్పుడల్లా నిద్రనుండి అకస్మాత్తుగా జాగ్రదావస్థలోకి వచ్చినవానికి మల్లేత్రుల్లి పడుతూంటాడు. చుట్టపక్కాలువచ్చి "పెద్దకూతురు కింకా పెండ్లి చేయలేదేం?" అని అంటే ఎవరోతననువెంటబడి తరుముతూట్లని తనుకూతురుకు వరుణ్ని వెతక్క తప్పింది. కాదు రాజేశ్వరరావుకి.

ఏలూరులో ఎరిగిన వారున్నారని పెళ్లి ప్రసక్తి తెస్తే "చూడండి మావాడు ఈ సంవత్సరం ఇంటరు ప్యాసయ్యాడు. యం.బి.బి.యస్ ఏమైనా చెప్పించగలరా?" అని అడిగారు.

తెనాలిలో తెలిసిన వారున్నారని వారింటి చుట్టూ నాలుగు మార్లు తిరిగితే "అక్కరలేదు. మీ కంటే ఎక్కువ వరదక్షిణ ఇస్తామని వచ్చారు నిన్న బెజవాడనుంచి. ఆ సంబంధం ఖాయం చేసుకున్నాం" అని సాగనంపారు.

బందరులో బంధువులైన వాళ్లున్నారు. సంబంధం మంచిది. అనుకొని వెడితే "మావాడి కిష్టం లేదుట" అని అన్నారు.

"పెండ్లి సంబంధం కుదరడమే ఇంతకష్టంగా వుంది. ఇక కుదిరితే ఎన్ని ఇబ్బందులో" అని దీర్ఘనిట్టూర్పు విడిచి ఇంటిదారి పట్టాడు రాజేశ్వరావు.